క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

పాతపట్నం: మండల కేంద్రంలోని సినిమా హాల్ రోడ్డు పనులను రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ అర్జునుడు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం సీసీ రోడ్డు పనులు మంజూరు చేసిందన్నారు. పనులు సకాలంలో పూర్తిచేయాలన్నారు. జాతీయ రహదారి నుంచి సినిమా హాల్ మీదుగా టీచర్స్ కాలనీ వరకు పనులు చేపడతామన్నారు. మండల సచివాలయ కన్వీనర్ వై.సూర్యం, సూపరింటెండెంట్ కె.అప్పలనాయుడు, కృష్ణారావు, తిరుపతి, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

3 లోగా సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

హిరమండలం: ఈ నెల 3వ తేదీ లోగా ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు సంబంధించిన ఫీజు చెల్లించాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పి.ఈ.ఎస్.పట్నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 1 నుంచి 20వ తేదీ వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

హిరమండలం: వేసవి సెలవుల్లో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి కె.ఎర్రమ్మ కోరారు. హిరమండలంలోని పలు పాఠశాలలను ఆదివారం సందర్శించారు. గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేయడం జరుగుతందన్నారు. పలు రకాల కథలు, పాఠ్య, జనరల్ నాలెడ్జ్, కాంపిటేటివ్ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, వార్తా పత్రికలు ఉంటాయన్నారు.

నాడు-నేడు పనులపై ప్రత్యేక శ్రద్ధ

నరసన్నపేట: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న నాడు-నేడు పనుల పర్యవేక్షణ ఆయా హెచ్ఎంలు నిర్వహించాలని ఎంఈఓ శాంతారావు సూచించారు. హెచ్ఎంలతో ఆదివారం సమావేశం నిర్వహించారు. జూన్ నాటికి పనులు పూర్తిచేయాలన్నారు. హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సెలవుల్లో పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలని, నిల్వ ఉన్న బియ్యం, ఇతర పదార్థాలు జాగ్రత్త చేయాలని సూచించారు.

ముగిసిన అమ్మవారి మహోత్సవాలు



కుంకుమ పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారి ఆలయ ఆవరణలో మాల మంత్ర హోమాలు, నీరాజన మంత్ర పుష్పాలతో ఎమ్మెల్యే రెడ్డి శాంతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారంతో ఆలయ 48వ వార్షిక మహోత్సవాలు ముగిశాయి. ఎమ్మెల్యే ఖడ్గ నామాలతో కుంకుమార్చనలు నిర్వహించారని అర్చకులు సంతోష్ తెలిపారు. ఈఓ వాసుదేవ రావు, చైర్మన్ నూలు ఈశ్వరరావు, వైస్ ఎస్.ప్రదీప్, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

బూర్జ: మండలంలోని ఓ.వి పేట గ్రామంలో గల రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రత్యేకంగా కృషి చేస్తున్నారని మండల ఉపాధ్యక్షులు బుడుమూరు సూర్యారావు అన్నారు. స్పీకర్ కృషి ఫలితంగా ఆలయ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆదివారం తెలియజేశారు. డిసెంబర్ నుంచి దీప, దూప, నైవేద్యం కోసం ప్రతీ నెల రూ.5 వేలు ప్రభుత్వం నుంచి ఆలయ ప్రధాన అర్చకులకు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆమదాలవలస నియోజకవర్గంలో 14 ఆలయాల అభివృద్ధికి స్పీకర్ కృషి చేసినట్లు వివరించారు. సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ, మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస రూరల్: మండలంలోని తొగరాం గ్రామంలో గల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సోమవారం మరమ్మతులు నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎలక్ట్రికల్ రూరల్ ఏఈ బి.రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో తొగరాం, జీకేవలస, నిమ్మతొర్లాడ, చీమలవలస, కొర్లకోట, నెల్లిపర్తి, వెదుళ్లవలస, హనుమంతుపురం గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

వృథాగా నీటి తొట్టెలు

- పశువులకు తాగునీటి ఇబ్బందులు
- నిర్వహణ లోపంతో అధ్వాన పరిస్థితి

నీటి తొట్టెల నిర్మాణ వివరాలు..

నియోజకవర్గం	నిర్మించిన నీటి తొట్టెలు
ఆమదాలవలస	1546
పాతపట్నం	1623
నరసన్నపేట	1823



వి.ఎన్.పురంలో మూలకు చేరిన నీటితొట్టె

సరుబుజ్జిలి: పశువుల దాహార్తిని తీర్చేందుకు గ్రామాల శివార్లలో 2015లో నీటి తొట్టెలు నిర్మించారు. వీటి నిర్మాణం, నిర్వహణ సంక్రమంగా చేపట్టకపోవడంతో ఈ లక్ష్యం నీరుగారింది. లక్షలాది రూపాయల నిధులు వృథా అయ్యాయి. పాతపట్నం, ఆమదాలవలస, నరసన్నపేట నియోజకవర్గాలకు సంబంధించి వేసవిలో పశువుల తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ఒక్కో నీటితొట్టిని రూ.35 వేలు వెచ్చించి 4992 నీటితొట్టెలు నిర్మించారు. పచ్చిక బయళ్లపైకి మేతలకు వెళ్లి తిరిగి వచ్చిన పశుల దాహార్తిని తీర్చేందుకు పంచాయతీ పొలిమేరల్లో వీటి నిర్మాణాలు చేపట్టారు.

నిర్వహణ కరువు..

తొట్టెల్లో నీరు నింపేందుకు గ్రామస్థాయిలో ఎవ్వరూ బాధ్యత తీసుకోలేదు. వీటికోసం బోర్లు కూడా ఏర్పాటు చేయలేదు. నీటి తొట్టెలను పలుచోట్ల చెత్త కుండీలుగా ఉపయోగిస్తున్నారు.

కలుషిత నీరే దిక్కు.....

నీటితొట్టెల నిర్వహణ విషయంలో అధికారులు దృష్టిసారించక పోవడంతో పశువుల తాగునీటికి కోసం పాడి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. చెరువులు పూర్తిగా అడుగంటి పోవడం వల్ల మురికి గుంతల్లో ఉన్న కలుషితనీరే పశువులు తాగుతున్నాయి. దీనివల్ల అంటువ్యాధులకు గురవుతున్నాయి.

తాగునీటి సౌకర్యం కల్పించాలి



లక్షలాది రూపాయల నిధులతో నీటితొట్టెలు నిర్మించినా వాటి నిర్వహణ చేయడంలేదు. దీనివల్ల వేసవిలో పశువులకు మంచినీరు దొరకడంలేదు. బోర్ల ద్వారా వచ్చిన నీటిని తొట్టెల్లో నింపి పశువుల దాహార్తిని తీర్చుతున్నాం.

– కె.జగ్గునాయుడు, పాడిరైతు, కొండవలస

వ్యాధుల బారిన పడుతున్నాయి..



మండుటెండలో మేతకు వెళ్లివస్తున్న పశువుల దాహం తీర్చేందుకు మురుగునీరు పెడుతున్నాం. నీటి కాలుష్యం వల్ల తరచూ పారుడు, జబ్బవాపు వ్యాధుల బారినపడుతున్నాయి. చికిత్సలు అందించలేక నరకయాతన అనుభవిస్తున్నాం.

– ఎ.అప్పన్న, పాడిరైతు, కొండవలస

నిర్వహణ చేపడతాం

పశువుల దాహం తీర్చేందుకు ఏర్పాటు చేసిన నీటితొట్టెల నిర్వహణ విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నమాట వాస్తవమే. గ్రామల్లో నీటితొట్టెల పరిస్థితులు తెలుసుకొని నిర్వహణ చేసేందుకు అన్ని చర్యలు తీసుకొంటాం.

– దామోదరరావు,
సహాయ సంచాలకులు, పశుసంవర్ధకశాఖ,
సరుబుజ్జిలి

పరామర్శ..



అప్పారావునాయుడును పరామర్శిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే కృష్ణదాస్

పోలాకి: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పాగోటి అప్పారావునాయుడు భార్య ఇటీవల మృతి చెందారు. దీర్ఘాశిలోని అప్పారావునాయుడు కుటుంబాన్ని మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ఆదివారం పరామర్శించారు. అనంతరం స్థానిక పరిస్థితులను మండల నాయకులకు మంత్రి అడిగి తెలుసుకున్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, అడ్వకేట్ గణేష్, పార్టీ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

దిలీప్‌కుమార్ తల్లి మృతికి సంతాపం..

ఏపీటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు చింతాడ దిలీప్‌కుమార్ తల్లి అన్నపూర్ణమ్మ మృతి పట్ల డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు సంతాపం వ్యక్తం చేశారు. అప్పారావుపేటలోని ఆయన ఇంటికి మండల పరిషత్ సలహాదారు ముద్దాడ బైరాగినాయుడు, పార్టీ నాయకుడు చింతాడ ఉమామహేశ్వరరావు తదితరులు వెళ్లి పరామర్శించారు.

గ్రామ దేవత ఉత్సవాలు ప్రారంభం



హిరమండలం: పాతహిరమండలంలో ఉజ్జిడి బండి తిరువీధి చేపడుతున్న భక్తులు



సారవకోట: ఉజ్జిడి బండి తిప్పుతున్న స్థానికులు



నరసన్నపేట: గ్రామ దేవరకు పూజలు చేస్తున్న మహిళలు

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ గ్రామంలో ఆదివారం నుంచి సిరిమాను పండుగలు ప్రారంభమయ్యాయి. 14 ఏళ్ల తరువాత మూడు రోజుల పాటు ఈ పండుగలు నిర్వహించనున్నారు. గ్రామంలో ఉజ్జిడి బండి తిప్పుతూ ఉత్సవాలు ప్రారంభించారు. తొలుత చెవిటమ్మతల్లి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఉత్సవాలు చేపట్టారు. గ్రామస్తులు చెప్పులు లేకుండా తిరగడం, ఇంట్లో మంచాలు, కుర్చీలు మీద కూర్చోకుండా ఉండనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం కత్తిరివానిపేట నుంచి సిరిమానును తీసుకురానున్నారు.

హిరమండలం: పాతహిరమండలం గ్రామ దేవత నీలామణి అమ్మవారి ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమైయ్యాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఊరులోకి ఆహ్వానించేందుకు వెదురుతో తయారుచేసిన ఉజ్జిడి బండితో గ్రామంలో తిరువీధి కార్యక్రమం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మ వారికి ముగ్రాటలు సమర్పించారు. నియమం మేరకు గ్రామ సరిహద్దుల్లో పూజలు చేశారు. 9 రోజుల పాటు పండగలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు.

నరసన్నపేట: మండలం జమ్ములో ఆదివారం అసిరి తల్లి గ్రామ దేవత ఘటాల పండగ ప్రారంభమైంది. గ్రామ దేవరకు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. 20 ఏళ్ల తరువాత ఘటాల పండగ నిర్వహిస్తుండటంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. సర్పంచ్ వాన గోవిందరావు, కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు చేపట్టారు.

నేడు స్పీకర్ పర్యటన

పొందూరు: మండలంలో స్పీకర్ తమ్మినేని సీతారాం సోమవారం పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల కమిటీ కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్ ఆదివారం తెలిపారు. తోలాపిలో చేనేత కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

భోజన పొట్లాల పంపిణీ



భోజన పొట్లాలు అందజేస్తున్న సమితి సభ్యులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని మెట్టక్కివలస ప్రాంతంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నారాయణసేవ నిర్వహించారు. పలువురు పేదలకు భోజన పొట్లాలు అందజేశారు. అలాగే ఆ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు. సమితి కన్వీనర్ కామావధాని, మాజీ కన్వీనర్ ఎ.గజపతిరావు, కార్యవర్గ సభ్యులు కె.ప్రహ్లాదరావు, జి.మల్లేశ్వరరావు, బి.వెంకటరమణ, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ కె.వి.రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉర్లాం స్కూల్లో చేరండి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

నరసన్నపేట: ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మురళి, జగన్నాథరావు, మన్మథరావు తదితరులు గ్రామాల్లో ఆదివారం ప్రత్యేక క్యాంపెయిన్‌ను నిర్వహించారు. పూర్తిస్థాయిలో వసతులు, తరగతి గదులు, విశాలమైన ఆట స్థలం, నిపుణులైన ఉపాధ్యాయులు ఉన్నారని వీఎన్ పురం యూపీ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. 8 వ తరగతిలో ఉర్లాం స్కూల్లో చేరాలని కోరారు. విద్యార్థులు సాధిస్తున్న మార్కులను ఉపాధ్యాయులు వివరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రన్ని ప్రారంభిస్తున్న గ్రామ పెద్దలు

మెళియాపుట్టి: మండల కేంద్రానికి పలు అవసరాల కోసం వస్తున్న ప్రజల దాహార్తి తీర్చడానికి చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని పలువురు పెద్దలు అన్నారు. స్థానిక రెడ్డి బజార్‌లో ఆదివారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మానవతా దృక్పథంతో ఇటువంటి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషకరమన్నారు. దుక్క చాణుక్య రెడ్డి బస్వ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వేదన తీరింది



నేడు సుందరంగా రూపుదిద్దుకున్న కణుగులవలస-ముద్దాడపేట పంచాయతీరాజ్ రోడ్డు

ఆమదాలవలస రూరల్: కణుగులవలస-ముద్దాడపేట జంక్షన్ పంచాయతీరాజ్ రోడ్డు గతంలో గోతులమయంగా ఉండేది. రాకపోకలకు వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. సుమారు 15 ఏళ్లుగా పాలకులు ఈ రోడ్డును పట్టించుకోపోవడంతో అధ్వానంగా మారంది. వర్షం కురిస్తే గోతుల్లో నీరుచేరి చెరువును తలపించేది. ఈ రోడ్డుకు నేడు మహర్దశ పట్టింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో స్పీకర్ తమ్మినేని సీతారాం చొరవతో ఈ రోడ్డు అభివృద్ధికి నోచుకుంది. సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలకు అనువుగా ఉండే ఈ రహదారి రూ.3.63 కోట్ల వ్యయంతో సుమారు 10 కిలో మీటర్ల మేర నిర్మాణం జరగడంతో ఇప్పుడు ప్రయాణం సాఫీగా, సుఖంగా జరుగుతుందని వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు కణుగులవలస- ముద్దాడపేట పంచాయతీరాజ్ రోడ్డు దుస్థితి

అబ్దుల్ కలాం విగ్రహం ఏర్పాటు



పాఠశాలలో ఏర్పాటు చేసిన అబ్దుల్ కలాం విగ్రహం



శిల్పి హరికృష్ణకు సన్మానిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఆమదాలవలస: ఆమదాలవలస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న ఎం.సుబ్బలక్ష్మి తన భర్త సత్యనారాయణ జ్ఞాపకార్థం విగ్రహాన్ని సమకూర్చారు. విగ్రహాన్ని తయారు చేసిన శిల్పి గేదెల హరికృష్ణను ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస: వాసవి మాత జయంతి సందర్భంగా ఆదివారం ఆమదాలవలస పట్టణంలో గల వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రవిశర్మ ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు టి.రామకృష్ణారావు, టి.బంగారురాజు, టి.సత్యనారాయణమూర్తి, సి.హెచ్.మహేష్‌బాబు, ఆత్మకూరి రమకృష్ణ, భక్తులు పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేశారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు.

సరిహద్దుల గుర్తింపు వేగవంతం



సర్వేరాళ్లను సిద్ధం చేస్తున్న సిబ్బంది

ఎల్.ఎన్.పేట: ఇప్పటికే సమగ్ర భూమి రీసర్వే పూర్తి చేసుకున్న రెవెన్యూ గ్రామాల్లో సర్వే రాళ్ల పాతే ప్రక్రియ వేగవంతం చేయాలని తహసీల్దార్ బి.ఎస్.ఎస్.సత్యనారాయణ సర్వే సిబ్బందికి సూచించారు. శ్యామలాపురం రెవెన్యూ పరిధిలో జరుగుతున్న సర్వే రాళ్లను పాతే ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. రైతుల సమక్షంలో సర్వే నంబర్లు, సబ్ డివిజన్లు వారీగా సర్వే రాళ్లను పాతాలన్నారు. మండల సర్వేయర్ రెడ్డి గవరయ్య, గ్రామ సచివాలయ సర్వేయర్ మనోజ్, తిరుమల పాల్గొన్నారు.

భగవద్గీతతో ముక్తికి మార్గం



ధర్మప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఆమదాలవలస రూరల్: భగవద్గీతతో భక్తిభావానికి మార్గం లభిస్తుందని హిందూ జ్ఞాన ప్రచార వేదిక శ్రీకాకుళం కమిటీ అధ్యక్షుడు సంతోష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని హడ్కో కాలనీలో ఆదివారం భగవద్గీత అవశ్యకతపై కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. భగవద్గీతతో ప్రతి సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు. త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రభోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత వంద రకాల గ్రంథాలను విక్రయించినట్లు తెలిపారు. సభ్యులు దుర్గారావు, పుండరీకాక్షయ్య, ఈశ్వర్‌లాల, వెంకటరావు, గోపాలకృష్ణ, ప్రశాంతి, స్వాతి, సంతోషి, లక్ష్మి పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగించాలి



బప్పడాం సమీపంలో పేరుకుపోయిన గుర్రపు డెక్క

సరుబుజ్జిలి: యరగాం- పురుషోత్తపురం ఓపెన్ హెడ్ చానల్‌తోపాటు, వంశధార కుడి ప్రధాన కాలువ, పిల్ల కాలువల్లో గుర్రపు డెక్క విస్తారంగా పేరుకుపోయింది. దీంతో ఏటా సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏమాత్రం సాగునీరు కాలులోకి వచ్చినా శివారు ప్రాంతాలకు ప్రవహించడానికి అవకాశం లేకుండా పోతుందని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి గుర్రపు డెక్క తొలగించాలని కోరుతున్నారు.